# పేటలో పోలింగ్ ప్రశాంతం

- ఉదయం మందకొడిగా పోలింగ్
- సాయంత్రం సమయం దాటినా కేంద్రాల వద్ద బారులు దీరిన ఓటర్లు
- శేరివెంకటాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి దంపతులు

నారాయణపేట, నవంబర్ 30: జిల్లాలోని నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలలో గురువారం శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటలకు ప్రారం భమయిన పోలింగ్ సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో 7.20నిమిషాలకు ప్రారంభం అయింది. అయితే కొన్ని కేంద్రాల్లో పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు క్యూలైన్‌లో ఉండడంతో పోలింగ్‌ను కొంత సమయం వరకు కొనసాగించారు. ప్రతి రెండు గంటలకో సారి అధికారులు రెండు నియోజకవర్గాలలో నమోదయిన పోలింగ్ శాతాన్ని విడుదల చేశారు. పోలింగ్ ప్రారంభం నుంచి 9గంటల వరకు మక్తల్ నియోజకవర్గంలో 9.67 పోలింగ్ శాతం నమోదు కాగా, నారాయణపేట నియోజకవర్గంలో 8 పోలింగ్ శాతం నమోదయింది. ఉదయం 11గంటల వరకు మక్తల్ నియోజకవర్గంలో 24.56 శాతం, నారాయణపేట నియోజకవర్గంలో 21.60శాతం నమోదయింది. మధ్యాహ్నం 1గంట వరకు నారాయణపేట నియోజకవర్గంలో 42.90శాతం, మక్తల్ నియోజకవర్గంలో 42.31శాతం నమోదయింది. మధ్యాహ్నం 3గంటల వరకు నారాయణపేట నియోజకవర్గంలో 55.4శాతం, మక్తల్ నియోజకవర్గంలో 58.86శాతం పోలింగ్ శాతం నమోదయింది. పోలింగ్ సమయం ముగిసే సరికి మక్తల్ నియోజకవర్గంలో 69.21 శాతం, నారాయణపేట నియోజకవర్గంలో 66.13శాతం నమోదయింది. అయితే పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు కొన్ని కేంద్రాలలో ఉండగా చివరి ఓటరు ఓటు వేసే దాకా పోలింగ్‌ను కొనసాగించారు. పోలింగ్ మొత్తం ముగిసే సరికి మక్తల్ నియోజకవర్గంలో 76.16, నారాయణపేట నియోజకవర్గంలో 76.17 పోలింగ్ శాతం నమోదయింది. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు నియోజకవర్గాలలో జరుగుతున్న పోలింగ్ పరిస్థితులు, ఓటింగ్ సరళిని కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్‌రూంలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అబ్జర్వర్ అభిషేక్ దేవల్, కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేశ్‌గౌతమ్ పర్యవేక్షించారు. మాగనూర్ మండలంలోని 64, 65, 66, 67 మోడల్ పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సందర్శించి పోలింగ్ ప్రక్రియను తెలుసుకున్నారు. కోయిల్‌కొండ మండలం శేర్‌వెంకటాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మక్తల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ శ్రీహర్ష దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**పేట మండలంలో..**

నారాయణపేటరూరల్, నవంబర్ 30: మండలంలోని అప్పక్‌పల్లి, సింగారం, జాజాపూర్, కోటకొండ, కొల్లంపల్లి, అభంగపూర్, బండగొండ, భైరంకొండ, జిలాల్‌పూర్,శేర్నపల్లితో పాటు తదితర గ్రామాల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు దీరారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అప్పక్‌పల్లిలో, జెడ్పీటీసీ అంజలి శేర్నపల్లిలో ఓటు హక్కు వినియోగించుకొన్నారు. పలు గ్రామాల్లో ఈవీఎంలలో సాంకేతిక సమస్యలతో పోలింగ్ కొంత నెమ్మదిగా కొనసాగింది.

**మరికల్‌లో 78 శాతం**

మరికల్ ,నవంబర్ 30: మండలంలో 78 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నారాయణ పేట నియోజకవర్గంలో 23705 మందికి గాను 18599 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పెద్దచింతకుంట లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, నారాయణ పేట జడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖరెడ్డి మరికల్‌లో తన ఓటును వినియోగించుకున్నారు. మరికల్ కు చెందిన వేముల శేషమ్మ (105) ఓటు వేశారు, మరికల్‌కు చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్రీనివాసచారీ డ్యూటిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులు హుషారుగా ఓటు వేశారు. మండలంలో సీఐ రాజేందర్‌నాయక్, ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తూ నిర్వహించారు. సాయంత్రం పేట ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డి పోలింగ్ కేంద్రలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

**కోయిలకొండలో..**

కోయిలకొండ, నవంబర్ 30:మండలంలో ఎన్నికల పోలింగ్ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు. మండలంలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా ప్రజలు ఓటు వేసేందుకు భారిగా తరలివచ్చారు. మండలంలోని శేరివెంకటాపూర్‌లో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి దంపతులు ఓటు హక్కు వినియోగించుకొన్నారు.

**కోస్గిలో 66 శాతం**

కోస్గి, నవంబర్ 30 : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆనంతరంలో కోస్గి మంల కేంద్రంతో పాటు మున్సిపల్‌లో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓంటింగ్ సరళిని పరిశీలించారు. కోస్గి మండలంలో 86 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**ధన్వాడలో 75 శాతం**

ధన్వాడ, నవంబర్ 30: మండలంలో 75 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 29,845 ఓట్లకు గాను 22,831 ఓట్లు పో లయ్యాయి. పేట ఎమ్మె ల్యే ఎస్.ఆర్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలిం చారు. కొండపూర్‌లో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు వాహిద్, జెడ్పీటీసీ విమా లదేవి ఓటు హక్కును వినియోగించుకున్నారు.


మరికల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి




ఓటు వేసి వస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ దంపతులు


ఓటు వేసి సిరాగుర్తు చూపుతున్న యువతులు


నారాయ ణపేటలో..




కోస్గిలో బారులు దీరిన మహిళా ఓటర్లు



వెబ్ కాస్టింగ్ పరిశీలిస్తున్న అధికారులు


ధన్వాడలో..


ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న యువతి


ఓటు వేయడానికి వస్తున్న వృద్ధ దంపతులు